నరసాపురానికి పాలకొల్లుకిమధ్య కాలువ గట్టు మీద వుంది రావుగారి లేసు ఫ్యాక్టరీ. అక్కడ పని చేస్తుండగా నా పరువు పోయినంత పనయింది.

తల కొట్టేసటంత పెద్ద అవమానం. ఎం.కాం. పాసయ్యావు 'ఎలకల్ని' పట్టలేవా అని అడ్డదిడ్డంగా ప్రశ్నించే అలగా జనపు నవ్వులాట మాట కాదు.

# థ్యాంక్స్ గంగీర

గంటి రమాదేవి

మిలిట్రీలో రిటైరయి, ఎంతో నమ్మకంగా నన్ను ఉద్యోగంలోకి తీసుకున్న రావుగారికి జవాబు చెప్పాలి.

బ్యాంకు డి.డి. తీసి రిజిష్టర్డు పోస్టు చెయ్యమంటే, ఫ్రం - టూ - అడ్రస్‌లు తికమకగా రాసి పంపించినట్టున్నాను. ఏదో టెండరు ఫారాలు, డి.డి. కలిపి - ఆఖరు రోజు అయిపోయింది. అది తిరిగొచ్చింది. ఇక నాకు మూడింది - ఉద్యోగం ఊడింది అనుకున్నాను. ఎం.కాం. వేస్ట్ - ఒక ఉత్తరం పంపలేకపోయాను.

రావుగారు కొబ్బరి చెట్టు కింద పడక కుర్చీలో కూర్చుని వున్నారు. ''మా తెలుగు తల్లికి మల్లెపూదండ'' అని పాడుకుంటున్నారు. ఆయన చేతిలో తిరిగొచ్చిన కవరు... ఆ కవరు నా ముఖాన కొట్టి - ''యూ స్టుపిడ్ -గెటవుట్'' అంటారనుకున్నాను. కాని అలా చెయ్యలేదు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి చూస్తున్నాను - చిత్రమైన మనిషి.

''మనసే అందాల బృందావనం - వేణు మాధవుని వలపే మధురామృతం'' అన్న పాట ఆయన హమ్ చేస్తుంటే చాలాసార్లు విన్నాను. వీణ అంటే ప్రాణం ఆయనకు. సాలూరు రాజేశ్వరరావు వీణ పాటలన్నీ రావుగారు వాయిస్తూ వుంటారు. వెంకటేశ్వర స్వామి అంటే అమిత భక్తి. చెమ్మగిల్లిన కళ్లతో స్వామివారి విగ్రహాన్ని ఆర్ద్రంగా చూడ్డం నేను చూసాను... మిలిట్రీలో కల్నల్‌గా రిటైర్‌మెంటు తీసుకున్నాడు - ఇంకో చిత్రం - ఆయన హరికథలు చెప్తాడుట. ఇదేంటి - మిలిట్రీవాడు - ఇలా!!

నాకు వీణ మీద గాని, ఆ పాటల మీద గాని పెద్ద ఆసక్తి లేదు. ఓల్డ్ స్టఫ్ - కాని మా తెలుగు తల్లి అంటే చెప్పలేని అభిమానం - ఆరాధన.

నా కేసి తిరిగి అన్నారు - ''అనుభవ రాహిత్యం. ఈ పొరబాటును పాఠంగా చేసుకుని, భవిష్యత్తు దిద్దుకో'' అన్నారు.

గండం గడవడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకుని ''సింగినాదం'' అనుకున్నాను -

అదే... ఎస్ - ఎగ్జాట్లీ - ఆ నిర్లక్ష్యం నన్ను చిక్కుల్లో పడేసింది. నరసాపురంలోనో, ఏలూరులోనో కాదు - అమెరికాలో టెక్సాస్ హోస్టన్‌లో -

★ ★ ★

నరసాపురం నుంచి లేసు వర్క్ బెంగుళూరుకు వెడుతూ వుంటుంది. ఎస్.ఎస్.ఎస్. కంపెనీ (పార్టనర్ల పేర్లు - సునీల్ సుబ్బయ్య, సంగీతా ఎల్లమ్మా, సంపత్ రాచయ్యా - పేర్లు తమాషాగా లేవూ - కన్న సోదరులకి - సోదరివి) రాజాజీ నగర్ - బెంగుళూరుకు....

కొన్నాళ్ల అనుభవం తర్వాత, ఆ కంపెనీలో, పెద్ద జీతం మీద చేరాను. రెండు వేలు. ఎస్.ఎస్.ఎస్. కంపెనీలో అదే పెద్ద జీతం. నా డిజిగ్నేషన్ కూడా గొప్పగానే వుంది. మేనేజర్ - ఎక్స్‌పోర్ట్.

వరదకి కొట్టుకు వచ్చిన పాత చెప్పు ఇంటి పైకప్పు చేరినట్టు, నేను ఎక్స్‌పోర్ట్ 'టాక్స్'కి అమెరికా వెళ్లవలసి వచ్చింది. సునీల్ సుబ్బయ్య జర్మనీ వెళ్లాడు మెషిన్ టూల్స్ టై- అప్ గురించి. సంగీతా ఎల్లమ్మా ఎడ్వాన్స్‌డ్ ప్రెగ్నన్సీ, సంపత్ రాచయ్య, ఆ క్రితం వారమే వరల్డ్ టూర్ నుంచి తిరిగొచ్చాడు 'వియ్ విల్ సెండ్ అవర్ మేనేజర్'' అని అందరూ తీర్మానించి నన్ను తోసారు. అలా, బెంగుళూరు కూడా సరిగా తెలియని నేను టెక్సాస్ బయలుదేరాను.

గ్లోబును చూడడం, ఎనిమిదో తరగతిలో ఆపారనుకుంటా. ఇండియా మేపే సరిగ్గా చూడను. మా తెలుగు తల్లిని విడిచి పెట్టే వుద్దేశం వుంటే కదా - ఇక ప్రపంచ పటం ఎందుకు?

అమెరికా గురించి ఎవర్ని అడగాలి?... నా జి.కె. బండారం బయట పడుతుంది - ఎవర్ని అడిగినా. ఎస్.ఎస్.ఎస్. ఫ్యాక్టరీలో అందరూ - చాలా మట్టుకు లేడీ టైలర్స్! అప్పుడు గుర్తుకొచ్చారు రావుగారు - ఆయన మిలిట్రీలో పనిచేసారు - కాంబోడియా వెళ్లారుట. దానికి అమెరికా దగ్గరా? తప్పకుండా తెలుస్తుంది ఆయనకి - పాత బి.ఏ. కదా! ఉత్తరం రాశాను -

వారంలో జవాబు వచ్చింది - వివరాలతో - ఆయన అమెరికా సంయుక్త రాష్ట్రాల మేప్ పంపారు... చివరలో ఈ పాట.

''ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని-''

ఈ మాట నా బుర్రలో బాగా నానింది... నాటింది.

★ ★ ★

బారిష్టరు పార్వతీశంలా నేనేమీ చిక్కులు ఎదుర్కోలేదు- రావుగారిచ్చిన సలహాల వల్ల. కాని ఒకే



ఒక్క సలహా నన్ను పెద్ద ఆపదలోకి నెట్టింది - అదే ఏ దేశమేగినా -

టెక్సాస్‌లో గార్మెంట్ ఇంపోర్టర్స్ కన్సార్టియంలో చర్చలు జరిగాయి. అమెరికన్ ఇంగ్లీషు కొంచెం కష్టమయినా రెండు రోజుల్లో పట్టేశాను. ఇంకా జనం, ఫిలిప్పీన్స్ నుంచి, బంగ్లాదేశ్ నుంచి, శ్రీలంక నుంచి, మలేషియా నుంచి వచ్చారు. వాళ్ల అవస్థ వర్ణనాతీతం. అమెరికన్ స్పీడు అందుకోలేక తికమక పడిపోయారు.

డ్రెస్, డిజైన్స్, కలర్స్, టెక్సర్, క్వాంటిటీస్, రేట్స్ - చర్చకు వచ్చాయి - నేను భయపడ్డట్టు అవలేదు - అంతా సవ్యంగానే జరిగింది. ఏడోరోజు తిరుగు ప్రయాణం. ఆ రాత్రి ఇంపోర్టర్స్ కన్సార్టియం మాకందరికీ పార్టీ ఇచ్చింది.

ఆ పార్టీకి వెళ్లేక పోయినా బాగుండేది.

నాకు ఎన్నో ఇక్కట్లు తప్పేవి....

★ ★ ★

హ్యూస్టన్ - టెక్సాస్ రాష్ట్రంలో పెద్ద నగరం - విలక్షణమైనది. మన హైదరాబాద్, సికింద్రాబాద్‌లా, ఒకే పేరుతో వున్న రెండు నగరాలు - అది. తూర్పున డౌన్‌టన్, పశ్చిమాన గెల్లీరియా - డౌన్‌టన్‌లో ఆఫీసులు, బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు, పారిశ్రామిక కంపెనీలు - మరి గెల్లీరియాలో, షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, మద్యపాన శాలలు, మాసేజ్ సెంటర్లు, వ్యభిచార గృహాలు, ఎంటర్‌టెయిన్‌మెంట్ సెంటర్లు -

మధ్యలో నాలుగుమైళ్ల ఎడం - వాటిలో చిన్న చిన్న ఇళ్లు, ఓ పెద్ద పార్కు.

డౌన్‌టన్‌లో, పెద్ద భవనం, టెక్సాస్ కామర్స్ - వెయ్యి నలభై అడుగుల ఎత్తు పై మాటే.

దాని ప్రక్కన కొంచెం పొట్టిగా వుంది, మా పార్టీ జరిగే భవనం ''కామర్స్-పాన్-గ్లోబల్'' దాని పేరు.

అమెరికాకి వెళ్లేముందు హడావిడిగా కుట్టించిన సూటు వేసుకుని వెళ్లాను - అరగంట కష్టపడి టై కట్టుకుని టాక్సీలో బయలుదేరాను. చలిగా లేదు - ఈ టైతో మరీ గొంతు బిగించినట్టుంది.

''కామర్స్ -పాన్ గ్లోబల్'' భవనం ముందు దిగి, టాక్సీకి పే చేసి, లిఫ్టు వైపు నడిచాడు. టాక్సీకి ఇచ్చిన డాలర్లు తల్చుకుంటే గుండె గుభేల్మంది. అది నా రెండు నెలల జీతానికి సమానం.

పద్నాలుగో అంతస్థులో అప్పుడే జనం చేరారు. ఇంపోర్టర్స్ కాన్సార్టియం ప్రెసిడెంటు సైరస్-డి-రే కి అందరినీ పరిచయం చేస్తున్నాడు, మీటింగ్ కన్వీనర్ లియాగాండే -

నేను సరిగ్గా ఆ సమయానికి అక్కడకు చేరుకున్నాను.

''హి ఈజ్ ఫ్రం ఇండియా'' లియాగాండే అన్నాడు.

''లేట్ - లేట్ ఇండియన్-'' నవ్వుతూ నా చెయ్యి కలిపాడు. ఆ నవ్వులో వెటకారానికి నాకు మండింది. నేను ముందే బయలుదేరాను. హ్యూస్టన్‌లో ట్రాఫిక్ జాం ఇంత దరిద్రంగా వుంటుందని నాకేం తెలుసు?

''హి ఈజ్ మిస్టర్ డి.ఎం.రావ్'' లియాగాండే చెప్పాడు.

''ఓ! డిమ్ రావ్''

నాకు మళ్లీ మంట పుట్టింది. డిమ్ రావా? నేను డిమ్...

''నో - ఐయామ్ ధర్మవరపు మాణిక్యాల రావ్'' అన్నాను.

''డామ్ రాప్ మానియక్ రావ్'' హి... హి... అని పెద్దగా నవ్వి అన్నాడు.

సైరస్ మూతి మీద ఒక గుద్దు ఇద్దామని తమాయించుకున్నాను. సైరస్ పెద్ద ప్లాంటేషన్ ఓనర్ - పెట్రోలు కర్మాగారాలు, యుద్ధ విమానాల కర్మాగారాలు, పసిఫిక్ సముద్రంలో ఎన్నో దీవులు - లగ్జరీ యాచెస్, హోటల్ చెయిన్లు - వీటి అధిపతి. ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ టర్నోవర్ - లాభాలు.

టెక్సాస్‌లో ఇరవై వేల ఎకరాల ఫాం, టెక్సాస్ కొండల పాద భాగాన పెద్ద రాజభవనం లాంటి ఇల్లు, సర్వెంటు, క్వార్టర్లు - అతిథి గృహాలు, స్విమ్మింగ్

పూల్, షూటింగ్ రేంజ్, విమానాలు దిగేటందుకు రన్వే, రెండు హెలికాప్టర్లు, లియర్ జట్లు - పెద్ద సెక్యూరిటీ సెటప్...

భోజనాల సమయంలో మరింత అవమానం. సైరస్ అన్నాడు. ''మిస్టర్ మానియాక్ - తిను - తిను - మళ్లీ ఎప్పుడు తింటావో - మీ దేశంలో, పాములూ, మీరు సహజీవనం చేస్తారుటగా... మీ సాధూలు ఎల్లా వున్నారు''

నేను మాట్లాడలేదు.

''ఇక్కడున్న అయిటం చూసావా? - అరవై ఎనిమిది సైడ్ డిష్లు''

.....

''ఐస్ క్రీం తిన్నావా? క్రీం ఇట్ ఐసే - కుక్కకో

ఇక ఆగలేకపోయాను - ఆవేశంతో అన్నాను -

''మిస్టర్ సైరస్ - భారతదేశం అంటే ఏమనుకున్నావ్?... మేం పాములతో కాపురముంటున్నామా? మా దేశంలో ఇలాంటి నగరాలు, హోటళ్లూ, తినుబండారాలు వున్నాయి. ఇదేం కొత్త కాదు మాకు -'' అన్నాను.

సైరస్ నా మాటలకు నిర్ఘాంతపోయాడు - అవమాన భారం ముఖం మీద కనపడింది - కోటీశ్వరుడు - ఒక మామూలు మేనేజర్‌కి తల వగ్గడమా? నా సంవత్సర జీతం- అతనిచ్చే టిప్పులో పదో వంతు వుంటుందా?

అక్కడ మొదలయింది - వాదన - పంతం - పట్టుదల - ఆఖరికి పందెం -

★ ★ ★

సైరస్ తన ప్రతినిధులను నలుగురిని నాతో పంపుతాడు. వాళ్లను నాతోపాటు పదిరోజులుంచుకోవాలి. వాళ్ల హోటలు ఖర్చు నాదే. ఈ పదిరోజులూ, వాళ్లను వివిధ హోటళ్లకు తీసుకెళ్లాలి.

వాళ్ల లీడరు మన హోటల్సును, వాటి శుభ్రతను, రుచినీ బేరీజు వేస్తాడు... వాళ్ల అంచనా ప్రకారం వుంటే హోటలు బిల్లు వాళ్లే కట్టి వెళ్లిపోతారు. వాళ్లు ఏదైనా హోటలుకు రెండోసారి వెడితే అయిదువేల డాలర్లు



**అనుమానం**

''రమ నన్ను సీరియస్‌గా ప్రేమించటం లేదని అనుమానంగా వుందిరా!'' వాపోయాడు మధు ఫ్రెండ్ దగ్గర.

''ఏం జరిగింది?''

''మొన్న నేను ఆవేశంలో నువ్వు కోరితే కొండ మీద కోతినైనా తెస్తా అంటే, కాదంటే నువ్వు బాధపడతావు అలాగే తే అందిరా!''

-పి.నాగభూషణం
(అమలాపురం)

నాకు బోనస్‌గా ఇస్తారు. రెండుసార్లు వెడితే ప్రతీ తడవకీ రెండు వేలు డాలర్లు ఎక్స్ట్రా -


పట్టుదల - ప్రిస్టేజ్ - ఆత్మగౌరవం - ఇవన్నీ మెండుగా గల ఆంధ్రజాతి వారసుడ్ని, ఒక తెల్లవాడు మన తెలుగు జాతిని మన భారతదేశాన్ని అవమానకరంగా మాట్లాడితే సహించి వూరుకుంటానా? ప్రాణం కన్నా మానం ఎక్కువని మన పూర్వీకులు ఎందరు చావలేదు?

మంచి ఫోర్సుఫుల్‌గా 'డన్' అన్నాను యాంకీ యాసతో - కల్నల్ రావు మాటలు అప్పుడు గుర్తు రాలేదు.

అయితే రెండు విషయాలు నేను పూర్తిగా విస్మరించాను. ''ఈ వచ్చిన నలుగురూ - సైరస్ మనుషులు - అమెరికన్లు. మోసం చేసి - మాది దరిద్రగొట్టు దేశమే - చెత్త హోటల్లే - అంటే రెండోది - వీళ్లని పదిరోజులు ఫైవ్‌స్టార్ హోటల్సులో పెట్టాలి - మంచి హోటల్సుకి తిప్పాలి... మరి టాక్సీలకే దానికి తడిసి మోపెడవుతుంది - నా రెండేళ్ల జీతం చాలా?

''రావుగారూ!... మీరు చెప్పిన మాట వినకపోవడం ఎంత పని చేసిందంటే'' ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని - కాని...





★ ★ ★

లుఫ్తాన్సీ ఫ్లయిట్‌లో ముందు ఫ్రాంక్ ఫర్ట్ వచ్చి, అక్కడ్నుంచి బొంబాయి వచ్చాం. బొంబాయి టు బెంగుళూరు ఇండియన్ ఎయిర్ లైన్స్ విమానం.

బెంగుళూరులో దిగగానే అశోకా హోటలుకి తీసుకెళ్లాను వాళ్లను, నా ఎస్.ఎస్.ఎస్. కంపెనీ నన్ను రక్షించింది. నేను మేనేజర్ని అనగానే, ముందు డబ్బు కట్టమని అనలేదు... ఒక సమస్య తాత్కాలికంగా తీరింది... బిల్ టు కంపెనీ -

ఇక వీళ్లని మేపాలి...

★ ★ ★

## మొదటిరోజు...

సంపత్ రాచయ్యకి ఫోను చేసాను. హ్యూస్టన్ నుంచి మల్టీ మిలియనీర్ సైరస్ స్టాఫ్ నలుగురు వచ్చారని, వాళ్లు ఇక్కడ 'పది రోజులుంటారనీ, నాకు పదిరోజులు సెలవు కావాలనీ - అడుగుదామని అనుకున్నాను.

నా మాట పూర్తి కాక మునుపే రాచయ్య చెప్పాడు.

''ఈ పదిరోజులూ వాళ్లని ఎంటర్‌టెయిన్ చెయ్యి. మన కంపెనీ కారు తీసుకో''

''సర్! వాళ్లది ప్రైవేట్ విజిట్ - మన గార్మెంట్స్‌కి ఏమీ సంబంధం లేదు - అయినా వాళ్లున్న పది రోజులకి రోజూ అయిదారు వేలు అవుతుంది. మొత్తం అరవై వేలు'' అన్నాను చాలా తెలివితక్కువగా.

అన్నప్పుడు తెలియలేదు. నేను గుంభనంగా వూరుకుంటే ఈ అరవై వేలు ఎస్.ఎస్.ఎస్. కంపెనీ ఖాతాలో ఖర్చు రాయబడేది, ''ఫూల్ స్టుపిడ్ - పెద్ద సత్యసంధుడు'' అని నన్ను నేను తిట్టుకున్నాను.




**ఏమయింది?**

ఆమని ఆమధ్య స్లిమ్‌గా నవనవలాడుతూ కనిపించింది. 'శుభలగ్నం' చిత్రంలో తెరమీద ఎంచక్కా కనిపించింది. ఈమధ్య కాలంలో ఏమయిందో ఏమో వున్నపళంగా హాస్పిటల్‌లో చేరి చిక్కి సగమైపోయింది. దేనికి చిక్కిందోమరి- ఆమనిలో స్పీడు ఎక్కువ. ఒకరికి భయపడే ఇన్ఫీరియారిటీ లేదు. తను ఏమనుకున్నా చేసేస్తుంది. ఆ స్పీడే ఆమని చేత అర్థాంతరంగా ఒళ్లు కంట్రోల్ అయ్యే మహత్తరమయిన కార్యక్రమం ఏదో తలపెట్టింది. బెస్టాఫ్ లక్!

-సాయిరాం



''దెన్ - ఓన్లీ ఎకాంపనీ దెమ్... దట్స్ ఆల్'' అన్నాడు. గుడ్డిలో మెల్ల - టాక్సీ ఖర్చులు మిగిలాయి.

సైరస్ మనుషులు నలుగురూ - బ్రౌన్, రీడ్ - అలెగ్జాండర్, శామ్ - వస్తాదుల్లా వుంటారు. వాళ్ల పని ఇలా మేయడం - రిపోర్టులు సైరస్‌కు పంపడమేనేమో!

అశోకా హోటలులో వాళ్లను మధ్యాహ్నం పికప్ చేసుకున్నాను. ముందు ఏం మాట్లాడాలో తెలియక - ''సైరస్ కంపెనీలో మీరేం చేస్తూ వుంటారు?'' అని అడిగాను.

నలుగురూ కోరస్‌గా చెప్పారు - ''ప్రొఫెషనల్ ఈటర్స్'' తినటం మా వృత్తి.

బెంగుళూరులో గొప్ప పేరున్న హోటల్ ఆర్ అండ్ బి. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ కాదు. రిథమ్ అండ్ బ్లూస్... పాలరాయి టేబుల్స్ - కేన్ కుర్చీలు - గోడలకు వర్ణచిత్రాలు. పాత జూక్ బాక్స్ - తింటూంటే సంగీతం వినిపించడానికి.

బేరర్ మెనూ కార్డు అందించాడు.

ఆ నలుగురూ ఆ కార్డు కొన్ని క్షణాలు చూసారు... చకచకా ఆర్డర్ చెప్పారు.

చికెన్ అండ్ కాప్సికమ్!

చిల్లీ గార్లిక్ పొటాటో సలాడ్!!

ఆపిల్ వాల్‌నట్ గెటావూ!!!

ఛీస్ కేక్!

ఒక్కోటి అయిదు అయిటంలు చెప్పారు.

పిట్ట తిండికి మేక తిండికి మధ్యన వున్న వాడ్ని నాకెందుకు అవి. నేను సాండ్ విచెస్, ఫ్రెంచి ఫింగర్స్ అడిగాను.

ఆ హోటలులో సీట్లే చాలా తక్కువ. వున్నవే 32. అవీ నిండలేదు.

పదిహేను నిముషాలు పట్టింది - ఐటంలు రావడానికి.

నేను సాండ్‌విచెస్ తినే లోపల వాళ్లు సగం ప్లేట్లు ఖాళీ చేసారు. ఫ్రెంచి ఫింగర్స్ తినే లోపల మొత్తం ఖాళీ!

తర్వాత వాళ్లే టీ ఆర్డర్ చేసారు. 'మింట్' టీ విత్ స్నాక్స్! బిల్లు వచ్చింది.. ఎనిమిది వందల రూపాయలు ప్లస్ టాక్సెస్!! బిల్ టు ఎస్.ఎస్.ఎస్. అండ్ కంపెనీ అని రాసి సంతకం పెట్టేసాను ధైర్యం చేసి. ఇవ్వాలంటే నా దగ్గరున్నదంతా రెండు రోజుల్లో అయిపోతుంది.

ఆ 'వృత్తి మేతగాళ్ల' ముఖాలు ప్రసన్నంగానే వున్నాయి. అంటే నా ఖర్చులు నాకు గిట్టుతాయా!

ఆ ప్రశ్నకు సమాధానం ఆ సాయంత్రమే దొరికింది.

చక్కగా టైపు చేయించిన ఉత్తరం - సైరస్ అండ్ కంపెనీ లెటర్ హెడ్ మీద. నా పేరు మీద. కాపీ టు మిస్టర్ సైరస్ - ఫ్రం ప్రొఫెషనల్ ఈటర్స్ - అలెగ్జాండర్ సంతకం చేసాడు. లీడర్ ఆఫ్ ది టీమ్.

ఆ రిపోర్టులో రాసిన దాని బట్టి నాకు ఖర్చులు గిట్టు బాటు అయేటట్టు లేవు. ''నథింగ్ స్పెషల్'' అని



**తప్పు**

''ఏం తప్పు చేసావు? రోజా కాళ్లకే దండం పెడుతున్నావు?''

''మిమ్మల్ని పెళ్లి చేసుకున్నాను కదండీ!''

-పి.వి.మురళీకృష్ణ
(హైదరాబాద్)

వుంది దాన్లో.

వీళ్లకి స్పెషల్స్ కావాలా? ఎలా వస్తాయి స్పెషల్స్ - మన ముక్కల పులుసు, గుత్తి వంకాయ కూరా పెడితే తింటారా? - వెజిటేరియన్ గడ్డి అని నన్ను తినేస్తారా? ఇలా అయితే అర్వై వేలు గోవిందా! గోవిందా...

★ ★ ★

## మూడో రోజు

నిన్న 'తిండి పోతులు' మైసూరు వెళ్లారు. (ఆ బిల్లు నాకేనేమో) రాత్రే వచ్చారు.

బెంగుళూరులో గొప్పగా చెప్పుకునే 'మావళ్లీ టిఫెన్ రూం' (ఎం.టీ.ఆర్)కి తీసుకు వెళ్లాను. ఒకరోజు ముందు ఆ హోటలు మేనేజర్‌తో మాట్లాడి రిజర్వు చేసుకుంటే గాని దొరకలేదు.

ఎం.టీ.ఆర్. వాళ్ల వంటశాల 'క్లినికల్లీ క్లీన్' అనడం కంటే గుడిలా పవిత్రంగా వుంటుంది అంటే - సమంజసంగా వుంటుంది. చాలా ఆరోగ్యకరమైన వంట పద్ధతి. చక్కటి క్రమ శిక్షణ గల వర్క్ ఫోర్స్, అక్కడ పేదా, గొప్పా, దేశీ, విదేశీ అన్న బేధం లేదు. అందరూ ఒక్కటే.

తెల్లటి మల్లెపువ్వులాటి ఇడ్లీలు, సిల్కు కాయలలాటి వడలు, కొబ్బరి చట్నీ. కరకరమనే దోసలు, వాటిలో బంగాళా దుంపల కూర, వెండి గ్లాసులో కూర్గు కాఫీ.

పిట్ట - మేక తిండిగాళ్ళు, నేనే రెండు జతల ఇడ్లీలు, వడలు, దోశలు లాగించాను.

మా 'వృత్తి తిండిగాళ్లు' రిపీట్ ఆర్డర్స్ మీద రిపీట్ ఆర్డర్స్!

హమ్మయ్య - నాకు ఒక్కోడు అయిదు వేల డాలర్లు ఇచ్చేటట్టున్నారు. మొత్తం ఇర్వై వేల డాలర్లు - అంటే ఆరు లక్షల రూపాయలు. అమ్మో అంత అదృష్టమా?

ఆ సాయంత్రం చక్కగా టైపు చేసిన లెటర్ అందింది.

''న్యూట్రిషనల్లీ నథింగ్ స్పెషల్ -

నాకు కోపం మంచుకు వచ్చింది. వెంటనే అశోకా హోటలుకు ఫోను చేసాను - నెంబరు ఎంగేజ్డ్ • గంట తర్వాత దొరికింది.


అలెగ్జాండర్ ఫోను ఎత్తి - ''సారీ! మేం హైద్రాబాద్ మాట్లాడుతున్నాం - అందుకే డిలే'' అన్నాడు.

''హైద్రాబాదా? ఎందుకు? మీ సైరస్ టెక్సాస్ రాష్ట్రంలో కదా వుంట'' -

''నో నో - మేం రాంరావ్ - వన్స్ చీఫ్ మినిస్టర్ - ఎం.టీ.ఆర్. తో - చాలా నీట్ హోటల్ మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు - పొలిటీషియన్ ఏక్టర్ అయినా కూడా''


నాకు అలెగ్జాండర్ కన్‌ఫ్యూజన్ అర్థమయింది - ఎం.టి.ఆర్.ని, ఎన్.టి.ఆర్ అని అనుకున్నాడు. అది నేను వివరించే సరికి - అసలు సంగతి మర్చిపోయి





**తెలుగు విలన్లు**

తెలుగు చిత్రాల్లో విలన్‌లకు గిరాకీ బాగా పెరిగింది. కోటా బిజీ అయిపోయాడు. మళ్లీ అంతటి భారీ విగ్రహం వున్న పర్సనాలిటీలు తక్కువే. బొంబాయి విలన్ మహేష్ ఆనంద్, కృష్ణారెడ్డి పుణ్యమా అంటూ విపరీతమయిన డిమాండ్‌ను సంపాదించాడు. తెలుగు భాష తెలియక పోయినా, ఓన్లీ ఫైట్స్‌కీ, ఛేజింగ్‌లకీ ఉపయోగ పడుతున్న మహేష్ ఆనంద్‌కి రెమ్యూనరేషన్ ఆరు లక్షలని తెలిస్తే ఆశ్చర్య పోకమానరు.. 'ఈజీ మేకింగ్ మనీకి అలవాటు పడ్డ బొంబాయి తారలు తెలుగు ఇండస్ట్రీలో పడి దోచుకు తింటున్నారు'... అంటున్నారు తెలుగు విలన్లు. -సాయిరాం.



పెట్టేసాను.

## ఏడో రోజు

ఈ రెండు రోజులు, మా 'తిండి గ్యాంగ్' జోగ్ ఫాల్స్, శరవణ బెళగోడ వెళ్లి వచ్చారు.

పోతుల్లా తింటున్నారు - నథింగ్ స్పెషల్ అని రాస్తున్నారు. వీళ్ల పని ఇలా కాదని మంచి ప్లాను ఆలోచించాను. ఈ దెబ్బతో ఈ తెల్ల పీనుగులు గుడ్లు తేలెయ్యాలి.

ఈ సారి 'నాగార్జున' హోటల్ వైపు మళ్లింది మా కారు. నాగార్జున పక్కనే ఆంధ్రా హోటలు. మేమంతా కూర్చున్న తర్వాత మెనూ కార్డు వచ్చింది. నేనే ఆర్డర్ చేసాను - లోపల్లోపల నవ్వుకుంటూ -

చికెన్ చిల్లీ!
చికెన్ జింజర్!!
చికెన్ పెప్పర్!
చికెన్ గార్లిక్!
చికెన్ లెమన్!
చికెన్ సిక్స్‌టీఫైవ్!
ఎయిటీ ఎయిట్, ఎయిటీ నైన్
మటన్ ఫ్రై, మటన్ మసాలా, మటన్ చాప్స్!

ఒక్కొక్క ప్లేటే వచ్చింది. అప్పుడు నేననుకున్నాను. ''ఎప్పుడైనా అడవి అంటుకోడం చూసార్రా - ఇప్పుడు మీ కడుపులో అగ్ని ప్రమాదం జరుగుతుంది - కాస్కోండి''

ఒక్కొక్క అయిటమ్ తింటూ వుంటే వాళ్ల ఫేసులు చూడాలి. కళ్లల్లో, నీళ్లు - ముక్కులో నీళ్లు - గ్లాసులో నీళ్లు ఖాళీ - నేను కోకో కోలా తీసుకున్నా -

వాళ్ల ముఖాలు చూస్తూ వుంటే నాకు ''మా తెలుగు తల్లికి మల్లెపూదండ'' అన్న పాటతో పాటు - ''తెలుగువీర! లేవరా! దీక్షబూని సాగరా'' అన్న పాట కూడా గుర్తుకు వచ్చింది.

ఆఖర్న ''చికెన్ గోంగూర'' ఆర్డరిచ్చాను.

వద్దనలేదు - మా 'వృత్తి ఈటర్స్'

ప్లేట్లన్నీ నాకేసారు! అంటే వీళ్లంతా తృప్తి పడట్లూ ఇదివరకూ ఇలాగే ఖాళీ చేసారు - కాని రిపోర్టులో



### ముందూ... వెనకా!

''ఈ సంవత్సరం స్కూల్లో నువ్వంతగా వెనకబడి పోవటం నాకు బాగుండ లేదమ్మా!'' దీప్తితో అన్నాడు వాళ్ల నాన్న!

''మీరంత వర్రీ కావద్దు నాన్నా - ముందున్నా... వెనక వున్నా క్లాసులో వినేది ఒకే పాఠం కదా!'' కూల్‌గా బదులిచ్చింది దీప్తి.

-జోకర్ (హైదరాబాద్)

నథింగ్ స్పెషల్-


ఆ సాయంత్రం నాకు వచ్చిన లెటర్‌లో 'టూ ఫ్యాక్ట్ టు కామెంట్' అని వుంది. కాపీ మామూలుగా అమెరికా వెళ్లింది.

## తొమ్మిదో రోజు

మనసులోనే లెక్కేసుకున్నాడు. హోటలు ఖర్చులన్నీ కలిసి అర్వై వేలు దాటింది. ఇంకా ఇవాళ - రేపు గడవాలి. ఇంకో ఏదో పదిహేనో - ఇర్వై వేలు కృష్ణార్పణం...

ఆరోజు 'కౌషీస్' హోటలుకు తీసుకెళ్లాలను కున్నాను. పందెంలో ఓడిపోతున్నా తప్పదు కదా!






### 'కోడి' బాధ

నిజాన్ని నిర్భయంగా చెప్పే గట్స్ కొద్దిమందికే వుంటుంది. అందులో కోడి ఒకడు. 'కోడి' ఆంధ్ర దేశంలో షూటింగ్స్ జరపాలంటే ప్రభుత్వ సహకారం ప్రత్యేకంగా వుండాలి. లొకేషన్స్ చార్జెస్ విపరీతంగా పెంచేశారు. యివి చిన్న ప్రొడ్యూసరు చెల్లించగలిగే స్థాయిలో వుండాలి. అలాగే పర్మిషన్స్‌కి పెద్ద ప్రాబ్లమ్ అయిపోతుంది.

ముఖ్యంగా సెక్యూరిటీ, షూటింగు లొకేషన్స్‌లో అల్లరి మూకల బారి నుంచి సెక్యూరిటీ కావాలి. యివన్నీ లేకుండా డబ్బూ తగలేసి తలనొప్పితో టెన్షన్‌గా ఎంత కాలం షూటింగు చేయగలం? అన్నాడు.

-సాయిరాం




ఇల్లు అమ్మి అప్పులు తీర్చాలి. వున్న ఒకే ఒక ఆస్తి, ఈ బకాసురులు గాంగ్ తినేస్తుందా?

కౌషీస్ నాణ్యమైన రొట్టెలు, కోల్డ్ కాఫీకి ప్రసిద్ధి. ఈ ఆఖరి రోజు దీనితో సరి పెడదామని నా వుద్దేశం. అయితే అలెగ్జాండర్‌కి వేరే అయిడియా వున్నట్టుంది. 'విక్టోరియా' హోటలుకు వెడదామన్నాడు. రూటు మార్చి విక్టోరియాకి వెళ్లాం.

విక్టోరియా లోపలికి వెళితే రెండు వందల ఏళ్లు వెనక్కి వెళ్లినట్టు అనిపిస్తుంది. అసలు బిల్డింగే, బ్రిటిషు వాళ్ల టైముది. లోపల చాలా పాత సీలింగ్ ఫ్యాన్. హాలు మధ్యన సూర్యకాంతి సరాసరి లోపలికొచ్చేటట్టు, రూపుకు బదులు అద్దాల డోము, అద్దాలు, రంగులవి, ఒకవైపు సింహపు బొమ్మ, ఇంకోవైపు కొమ్ములున్న గుర్రం బొమ్మ మూడో వైపు ద్రాక్షతీగ, పళ్ల గుత్తులు, పూలూ...

ఓ మూల పాత రెఫ్రిజిరేటర్ ముదురు గోధుమ రంగుకి తిరిగి పోయింది. మొదట్లో పాల తెలుపుతూ వుండి వుండొచ్చు. అర్వై ఏళ్ల నాటి ఫిజిడయర్!

మెనూ కార్డు అందుకొని, అలెగ్జాండరే ఆర్డర్ చేసాడు.

ఎగ్ స్ట్యూ!
ఇడి అప్పమ్ - పాయాతో కలిసి!
చికెన్ లివర్ - బేకన్ టోస్టు!
పేట్ల మీద ప్లేట్లు చెల్లిపోయాయి.

బిల్లు వచ్చింది. ఎంతయిందో చూడలేదు. బిల్ టు ఎస్.ఎస్.ఎస్. అని రాసి సంతకం పెట్టాను.

నాకు తెలుసు ఆ సాయంత్రం వచ్చే లెటరులో ఏముంటుందో

నథింగ్ స్పెషల్ - అంతేగా

★ ★ ★

హెచ్.ఎ.ఎల్ విమానాశ్రయంలో సైరస్ గ్రూపుకు వీడ్కోలు చెప్పి వచ్చాను. వాళ్లు బొంబాయి వెళ్లారు.


ఆ రాత్రి అమెరికాకు ప్రయాణం.

ఆఫీసుకు తిరిగి వచ్చేసరికి ముగ్గురు పార్టనర్స్ నా గురించి ఎదురు చూస్తున్నారు. ఎస్.ఎస్.ఎస్. కంపెనీ పార్టనర్స్!

విమానం ఎక్కేటప్పుడు అలెగ్జాండర్ నాతో ఏమీ అనలేదు. అంటే - దానర్థం నన్ను ముంచినట్టే గదా! కాని వెళ్లేటప్పుడు అందరూ ఒక మాట అన్నారు - ''థాంక్స్ టు గంగీర'' - నలుగురూ విడివిడిగా అన్నారామాట - నేను పట్టించుకోలేదు. నా మనసంతా, నేను కట్టబోయే బిల్లుల సంగతి మీదే వుంది. గంగీరా లేదు...

ఆఫీసులోకి వెళ్లి చకచకా నా రాజీనామా రాసి, పార్టనర్స్ వున్న గదిలోకి వెళ్లాను.

''సారీ సర్స్! అండ్ మేడమ్! నేను చేసిన తప్పు నాకు తెలుసు. నర్సాపురంలో ఓ పెంకుటిల్లు వుంది నాకు. అది అమ్మి అప్పులన్నీ తీరుస్తా. నన్ను క్షమించండి'' - అని గిరుక్కున వెనక్కు తిరిగి వచ్చేసాను.



-ఉత్పల

# సాహితీ సుగంధం



తద్వక్త్రేందు విలోకనేన దివసో నీతః ప్రదోషస్తథా
తద్గోష్ఠ్యైవ నిశాపి మన్మథకృతోత్సాహై స్తదంగార్పణైః
తాం సంప్రత్యపి మార్గదత్తనయనాం ద్రష్టుం ప్రవృత్తస్యమే
బద్ధోత్కంఠమిదం మనఃకి మధవా ప్రేమాసమాప్తోత్సవః

\- అనంగహర్ష మహారాజు

ఉదయన మహారాజు తన ప్రేయసియైన వాసవదత్తను కలుసుకోడానికి వెళుతున్నాడు. దారిలో ఆలోచించాడు. ఇంతలోనే ఆమెను దర్శించాలన్న తన ఉత్కంఠకు కారణమేమిటి? పగలంతా చంద్రముఖి అయిన వాసవదత్త దర్శనంతో గడిపాను. సాయంకాలమంతా ఆమెతో కూడి సరసగోష్ఠితో గడిపాను. రాత్రంతా మన్మధోత్సాహంతో ప్రియాలింగనాదులతో గడిపివేశాను. ఇలా రాత్రింబగళ్లు ప్రియురాలితో సరసగోష్ఠులు జరిపాను. ఇంకా ఆ చంద్రముఖి దర్శనాన్నీ, ఆ సరసగోష్ఠినీ, ఆ ఆలింగన మధురిమలు పొందాలని వేగిరపడుతున్నాను. ఆమె లేకుండా ఒక్క క్షణమైనా గడప లేదుకదా! ఇంతలోనే ఆమెను చూడాలని నా మనసు వేగిరపడుచున్నది. ఎందుచేత? ఈ ప్రశ్నకు మధురమైన సమాధానం కవి చెబుతున్నాడు. ''అధవా ప్రేమ అసమాప్తోత్సవః'' అని. ''ప్రేమోత్సవం ఎన్నటికి సమాప్తం కాదు'' అని. ప్రేమికుల ప్రేమానందం ఒక సుదీర్ఘ పరంపర. దానికి సమాప్తి వుండదు - ఉదయనుని చరిత్ర తెలిసినవారు ఈ పద్యంలోని ప్రతి అక్షరాన్ని అభినందించకుండా ఉండలేరు.

అనంగహర్షుడు రచించిన ''తాపస వత్సరాజం'' నాటకంలోని ఈ శ్లోకాన్ని ఆచార్య కుంతకుడు తన 'వక్రోక్తి జీవిత'మనే గ్రంథంలో ఉదాహరించి కవి తన ప్రతిభాశక్తితో మామూలు మాటలలో విద్యుత్కాంతులను నింపగలడని నిరూపించాడు.

సంగీతా మేడమ్ పిలుస్తోంది - ''రావ్ - రావ్'' అని - నాకు తెలుసు - నిలబెట్టి మరీ గడ్డి పెడుతుందని - నాకింకా పౌరుషం చావలేదు.

రెండో రోజు సాయంత్రానికి ఇంటికి వచ్చాను. ఇల్లు అమ్ముతున్న వార్త అమ్మకు చెప్పాను. ఆవిడ గొల్లుమంది. మర్నాడు రావుగారు చివాట్లు పెట్టారు. ఎందుకొచ్చిన పందెం అని. ఇప్పుడని ఏం లాభం - అంతా అయిపోయిన తర్వాత.

పందెంలో గెలిస్తే ఇలా అందురా... ఇప్పటికీ అలెగ్జాండర్ అన్నమాట నాకు అంతు పట్టు లేదు - ''థాంక్స్ టు గంగీర''

ఇల్లు బేరం కుదిరేసరికి పదిరోజులు పట్టింది. వర్కింగ్ డే చూసుకుని మొత్తం సొమ్మిచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటానని చెప్పి వెళ్లాడు ఓ ఆసామి - తొంభై వేలకు బేరం సెటిలయింది.

మర్నాడు -

అనుకోని వింత జరిగింది.

సునీల్ సుబ్బయ్య, సంపత్ రాచయ్య, కార్లో మా ఇంటికి వచ్చారు - వాళ్లు చెప్పిన విషయాలు విని షాక్‌తో మాట రాలేదు -

సైరస్ కొరియర్ సర్వీసులో లెటరు పంపాడుట. దాంట్లో

''నథింగ్ స్పెషల్'' అంటే అమెరికాకి ఏమాత్రం తీసిపోదని.

''టూ ఫ్యాక్ట్ టు కామెంటు'' అమెరికాలో ఇది లేదని - చాలా గొప్పగా వుందనిట. అలెగ్జాండర్ అండ్ పార్టీ నాగార్జున హోటలుకు రెండు సార్లు వెళ్లారు. తర్వాత - చికె న్ గోంగూర తినడం కోసం.

ఇప్పుడు నాకు తెలిసింది - థ్యాంక్స్ టు గంగీర అంటే వాళ్లు అన్నది గోంగూర సంగతి.

సైరస్ పెద్ద ఆర్డరు పంపడానికి లెటర్ ఆఫ్ ఇండెంట్ పంపాడుట - రెడీమేడ్ బట్టల ఆర్డర్!

టెక్సన్లు అయిన ఆ గ్రూపు వాళ్లకి నాగార్జునలో ఆంధ్రా వంటకాలు అద్భుతంగా నచ్చాయుట. టెక్సస్ వంటలో కారం ఎక్కువ

అంటే - ·

నేను ఆ బిల్లులు కట్టక్కర్లేదు

\- నాకు ఇరవై వేల డాలర్ల పైనే ముడుతుంది.

నాలో సన్నగా పాటలు మొదలయింది. ''మా తెలుగు తల్లికి... తెలుగు షీర లేవరా''


సంపత్ రాచయ్య, నా చేతిలో పే ఆర్డర్స్ పెట్టాడు. ఒకటి ఖర్చులది - రెండోది నా బోనస్ - డాలర్లలో వున్న బ్యాంక్ ఆర్డర్!

''మాణిక్యాలావు నవరే - ఇప్పు నీవు నమ్మ పార్టనర్. బాళ కెలస ఇవి - బిరానా బార్రీ'' అన్నాడు (మాణిక్యాలావూ ఇప్పుడు మీరు నా పార్టనర్. చాలా పనుంది తొందరగా రండి) రాచయ్య కన్నడంలో.

సంపత్ రాచయ్య ఇచ్చిన చెక్ తీసుకుంటూ అన్నాను ''థ్యాంక్స్ గంగీర''.

*





## విజృంభణ

'మీనా' లాంటి ఉత్తమ చిత్రానికి దర్శకత్వం వహించి మంచి మహిళా దర్శకురాలుగా పేరు తెచ్చుకున్న విజయనిర్మల, భర్త కృష్ణ బిజీ అయిపోవడంతో ఆయన బాగోగులకే ఎక్కువ సమయం కేటా ఇస్తున్నది..! ప్రస్తుతం తన దర్శకత్వంలో కృష్ణ హీరోగా నటిస్తున్న 'పుట్టింటి గౌరవం' పూర్తవగానే మరో చిత్రానికి దర్శకత్వం వహించబఓతున్నట్లు, అందులో కూడా కృష్ణ, నరేష్ నాయకులుగా నటిస్తున్నట్లు చెప్పింది విజయనిర్మల. వచ్చే సంవత్సరంలో కృష్ణగారిలా నేనూ 'విజృంభిస్తాను' అంటోంది విజయనిర్మల.

-కృష్ణాజీ

